గ్రంథ నిలయం
3693
శ్రీకాకుళం

# వీరకుంకుమ

తల్లి గర్భంలో, వెచ్చగా హాయిగాలిపే మసకమసక తమస్సులు కల్పించిన అమరశాంతిలో, నిరామయుడై బుద్ధుడి వదనంతో, జీసస్ హృదయంతో, నిండు తొమ్మిదినెలలు తపస్సు చేసిన చిన్న ప్రతాపరెడ్డి-కెవ్వున కేక వేస్తూ, ధాత కరువు మిత్తియజ్ఞంతో మానవ జాతిమీద కసి తీర్చుకొంటున్న ప్రకృతి ఒడిలో పడ్డాడు. కరువులో పోయినవాళ్ళుపోగా, యింకా చావుతో పెనుగులాడి బ్రతికివున్న అమ్మలక్కలు చేరి-గోపాలకిష్టుడు పుట్టాడు-గోపాలకిష్టుడు పుట్టాడు-అన్నారు-ఆరోజు శ్రావణ బహుళ అష్టమి కావటంతో. వానలూ గుండ్లకమ్మ వరదలూ లేని శ్రావణమది. వర్షర్తువులో గ్రీష్మదేవి తాండవమాడుతోన్న ధాత నామ సంవత్సరమది అప్పటికి నాలుగు నెలలకిందటే కాటకపువాతబడ్డ నాగులురెడ్డి లేని అష్టమి అది. నాగులురెడ్డి అతని తండ్రి.

అమ్మలక్కల దీవనలు పుట్టిన చిట్టివాడు వినలేదు. నిద్రాణమై, వసంతంలోని లేతమామిడిగున్న చిగురువలెవున్న ప్రతాపరెడ్డి ఆత్మ, ఒక్కక్షణం తలెత్తి పరికించి స్తంభించిపోయింది. ఈ భయానక లోకమా, ఈ దయలేని ప్రకృతా తన క్రీడారంగం?

పిల్లవాడు పుట్టిన నాలుగురోజుల్లోనే తల్లిగూడా చనిపోయింది. జేజెమ్మ ఒళ్ళోకి తీసుకొని, అందరూ గోపాలక్రిష్టుడి పేరు పెట్టమని బలవంతం చేస్తుంటే, వినక-"నువ్వు ప్రతాపరెడ్డివిరా, దరిద్రుడా!" అన్నది బిడ్డడిని చూచి ముడుచుకొన్న గుప్పిటవిప్పి, ప్రతాపరెడ్డి జేజెమ్మ పమిటె పట్టుకొన్నాడు. అతని ఆత్మ భయంతో, దిగులుతో వణికిపోయింది దిగులులోపుట్టి, దిగులులో పెరిగాడు రెడ్డి.

ఐదేళ్ళు వచ్చింతర్వాతగాని ప్రతాపరెడ్డి బాగా నడవలేదు. కాని, దొడ్డికాళ్ళు పోయి, దృఢంగా తరతరాలనుండి సంక్రమించిన బిగువుతో నునుపుగా పెరిగాడు. జేజెమ్మ కథలు జెప్పింది. ఊకొట్టకుండా దిగులుతో విన్నాడు. పొలంలో, జేజెమ్మతోపాటు వచ్చినవాడు, మంచెకిందచేరి, ఎర్రబారుతూన్న సాయంత్రాన్ని

జూచి, భయపడి, చందమామలో పొన్న చెట్టకింద పాత గుడ్డలు కుట్టు కొంటున్న ముసలమ్మకు ఎవరు బువ్వపెడతారో తెలియక, జేజెమ్మ నడిగితే తిడుతుందని వణికి దిగులుతో నిద్రించి కలవరించి పెద్దవాడైనాడు. రాయల పురంలో అప్పటికి బడిలేదు. అందువల్ల ప్రతాపరెడ్డి చదువుకోలేదు. అందుకని మళ్ళీ దిగులు.

దిగులు మధ్యనే జీవన నిర్మాణం ప్రారంభమయింది. చీని తోటలో పెద్ద బావినుండి మోటదోలుతూ నూనూగుమీసాల యువకుడైనాడు. అంతలోనే జేజెమ్మ చచ్చిపోయింది-నూటపదేళ్ళు బతికి. ముడతలతో, జాలువారి- నకండలతో, జరతో నడవలేక నడుము వంగిన తన జేజెమ్మ గతేగదా-తనకుగూడా ఒకనాడు గాకుంటే మరొకనాడైనా? జొన్నచేల కొండ్ర, బుడ్డ చీనితోట ముసలి అవు, దాని పెయ్య దూడ జేజెమ్మ మట్టిమిద్దె-ప్రతాపరెడ్డికి మిగిలిన వప్పటికి. వాటినుండే జీవితాన్ని సాధించి, సృష్టించి, ప్రతి యేడూ పొంచివున్న కరువుతో పోరాటం సాగిస్తూ, జొన్నచేలో మంచెనుండి వడిశెల విసురుతూ, పొరుగురైతు కూతురు అన్నమ్మను కోతరోజుల్లో కూలీలకు చల్లన్నం దోసిళ్ళలో పోస్తూండగా చూచి, మనసుపడి పెళ్ళి చేసుకొన్నాడు. ఇంటివాడైన తర్వాత ప్రతాపరెడ్డిని కొత్తదిగులు పరించింది. అన్నమ్మ నోరు అశనిపాతం వంటిది. నోరు పారేసుకోవడంలో తనకు తనే సాటి. "బంగారమంటి గుండేగాని తాట్టిమట్టవంటి నాలిక"- అని పాపిరెడ్డి భార్య అన్నది. అన్నమ్మనోటికి అలవాటుబడ్డాడు. కాని, అన్నమ్మ కడుపు పండలేదు. ప్రతాపరెడ్డి నోరు కదపకుండా తన ఎదలోని దిగులును, తన మనసును పిండి కలకలమని నమిలి కొరుకుతున్న కొరతను తనలోనే దాచుకొన్నాడు. కాని, జీవితయాత్ర సాగిపోతూనే వుంది. మహానంది తిరనాళ్ళకు ప్రభ గట్టించి తన యెద్ల జతను ముందు నిలిపాడు. అర్జీలకు అరా లేకపోతే పదిమందినీ సై అని పించి, ఊరజెరువులో తుమ్మల్ని పడగొట్టించి, పూడిక దీయించి, నిటారుగా కట్టలు బోయించి, మాలపల్లెకుగూడా కడపబండల్తో కొత్తరేపు గట్టించి సెభాసని పించుకొన్నాడు. పిచ్చిరెడ్డిగారి మిర్చిమడి తగాయిదాకు పంచాయతీ అయి, పెదరెడ్డికాడ తక్కిన పంచాయతీదార్లు యింతో అంతో తిని అబద్ధమాడితే, తను నిక్కచ్చిగా నిలబడి, పిచ్చిరెడ్డి యింటి దీపం నిలిపాడు. తన పుణ్యాఫలమేమో- తన జుట్టు నెరిసే యీడున అన్నమ్మ కడుపు పండి, సంక్రాంతి రోజుల్లో చిట్టిరెడ్డి పుట్టాడు.

చిట్టిరెడ్డి పుట్టింతర్వాత, ప్రతాపరెడ్డి జీవితంలో ఒక అర్థం, గమ్యం, లక్ష్యం అవుపించినాయి. చిట్టిరెడ్డి తనలాగా కరువుతో పుట్టలేదు. సంక్రాంతిలో పుట్టాడు. ధాన్యలక్ష్మితోపాటు వచ్చాడు యింటిలోకి. తనలాగా చీనితోట మోట చుట్టూ బుల్లిచర్నా కోలతో తిరిగాడు. మంచెమీదికి గుంజ నెగబాకి ఎక్కి వడిశెల విసరటం నేర్చుకొన్నాడు. అన్నమ్మనోటిధాటికి తనవంక జూచి, తనకు మాత్రమే అర్థమయ్యే చిరునవ్వుతో పెదిమ విరిచి తప్పుకోవటం అలవాటుబడ్డాడు. ఈ చిట్టిరెడ్డి తనతర్వాత చీనితోట సంగీతం విని ఆనందించే వారసుడు. తన తర్వాత జొన్నచేను తలవంకించి తలగుడ్డను కన్నుగీటినప్పుడు అదిలించి మంచె మీది కెక్కి రివ్వుమనిపించగల ఒక గడ్డ పుత్రుడు. తన తర్వాత పంచాయతీలో, మోకాలుకూ నడుముకు పుత్తరీయం బిగించి, తన సాంప్రదాయం నిలబెట్టగల్ల యింటిబిడ్డ. ఈ జీవితానికి గాక మరి దేనికి అర్థం?

తన చిట్టిరెడ్డిహయానికైనా తుంగభద్ర కాలవపడి, ఈ భూమిలో బంగారం గనులు గనులుగా దొరకాలని అర్జీపెట్టి వేలు ముద్రలు వేశాడు. కాని, పోయిన తర్వాత తిరిగి క్షేమం తెలిపే చుట్టాలుగావీ అర్జీలు.

## 2

ప్రతాపరెడ్డి జీవితానికి అర్థం వచ్చిందిగాని, అర్థం దిగులును పోగొట్టలేదు. తిరిగి అయిదేళ్ల కరువు, యిన్నాళ్లూ పొంచిదాగిన మృత్యువు - వచ్చింది. ఊర చెలువు ఎండిపోయింది శ్రావణమూ, రోహిణికార్తె చెట్టపట్టాలు పట్టినవి. ఈ రోజుల్లోనే చిట్టిరెడ్డి చదువుమాట వచ్చింది. మిర్చితోట తాకట్టుబెట్టి డబ్బు తెచ్చి కర్నూలు పంపించాడు కొడుకును. మిరపమడి మాడిపోయినా, జొన్నకంకి కంటి కగుపించకపోయినా, చీనితోట ఎండి సంగీతం వినిపించకపోయినా, అడుగు జూపి, కడుపు తరిగిన మోటబావిలో తన మాటలే తిరిగి తిరిగి తనకు వినిపించినా పక్కనే నుంచొని, ఒక్క చిరునవ్వుతో, పోయిన ఆశను తిరిగి మరలించ గలిగినవాడు, ఎండిన మోడును తిరిగి చిగిర్చగలిగినవాడు, కరువులో దాహం తీర్చే చలివేంద్రంలాగా తనవాడు, తన రక్తంలో రక్తం, తన కండలో కండ, తన బిడ్డ, తన ఆశ, తన వారసుడు, తన చిట్టిరెడ్డి—తనవలె పల్లెటూరి మూర్ఖుడు గాబోడు! అన్నమ్మ చదువెందుకన్నది. నీ కెందుకన్నాడు తను. మిర్చితోట తాకట్టునుండి విక్రయానికి బోయింది. కాని చిట్టిరెడ్డి కాలేజీలోకి వెళ్ళాడు.

ఈయేడు, ఈనాడు—అని మురిపించిన మేఘం ఆకాశంలో పలకలేదు. జొన్నచేను కూడా అమ్మివేశాడు. అయితేనేమి? నవ్వుతూ. దూరాన్ని చూచి ఆశ్చర్యపోయి కలలుగనే కళ్ళతో, పొందికగల అవయవాలమీద బస్తీ నాగరీకుడి గుడ్డలతో, నడిచిన తన బాటనే ఏదో వెలుగును వెలిగించిన దేవతా కుమారుడి వలె—పరీక్షలు పాసయిన తన కొడుకు లేడా? తన అంతరంగిక గర్వానికి మూర్తిగా, తన మార్దవంలేని మోటు స్నేహాన్ని అర్థం చేసుకొన్న ఆత్మీయ చెలి కాదై తన కొడుకు రాడా? అంతకన్నా మిక్కిలిగా ఆలోచించలేదు ప్రతాపరెడ్డి.

నెలవలకు యింటికొచ్చాడు—చిట్టిరెడ్డి. పొద్దుటినుండీ ఎదురుచూచి, మనసు నిలపలేక, అక్కడికి నాలుగు మైళ్ళున్న బస్సులువచ్చే రోడ్డుమీద, ఎండిన గానుగచెట్టు మొగననిల్చుని, బస్సు రాగానే కొడుకు పెట్టె అందుకొని కరువు సంగతి మరిచి, నడుస్తూ యింటికి తిరిగొచ్చాడు—కొడుకు పక్క పక్కనే తాకుతూ నడిచి. అవును, యీ నడకలో గూడా తృప్తి వుంది.

కొడుకు అమ్మసంగతి ఎప్పుడూ అడగడు.

"చిక్కిపోతున్నావు, నాన్నా!" అని తండ్రి భుజం తట్టి పొలం మధ్య నిలబడ్డాడు.

"లేదు....లేదు....అంతే....అంతే."

"ఎందుకులేదు? నాకు తెలుసు—జొన్న చేనుగూడా అమ్మేశావుట—ఆ కొత్త అసాములకేనా?"

ప్రతాపరెడ్డి మాట్లాడక పెట్టె దించి, ముఖం అటుతిప్పి కొడుకు చేతివేళ్ళు బిడియపడుతూ నొక్కాడు.

"అదుగో....ఆ దిగులే—" అని చిట్టిరెడ్డి తండ్రి నెరిసిన వెంట్రుకల్లోకి తన కుడిచేయి వేళ్ళు పోనిచ్చి సర్దాడు. ఇద్దరికీ పెద్ద నవ్వు వచ్చింది.

"దిగులేమిటి? దిగులు లేదు. నా చిట్టి వుండగా నా కెందుకు దిగులు?"

"హంపీ వెళ్ళాలి. నా స్నేహితులంతా వెళ్తున్నారు. నువ్వు గూడా రా నాన్నా!"

"ఎందుకులే? నేనెందుకు? నువ్వుపోయిరా."

"నువ్వెందుకేమిటి? మన విజయనగర రాజ్యం సంగతి చెప్తాను. అమ్మ కర్థంగాదు. నువ్వు రావాలి."

"ఖర్చులు...." అనబోయి ప్రతాపరెడ్డి నాలుక కరచుకొన్నాడు. "సరే ....ఎప్పుడు?"

"మంగళవారం...." అని కొడుకు జేబులోనుంచి సిగరెట్టు తీసి వెలిగించాడు. తన ముందు కొడుకు యిదివరలో ఎప్పుడూ కాల్చలేదు.

"మా నాన్నకు కోపం రాకేం....చ్చుచ్చుచ్చు....అసలు రాదంటే రాదు" అని పిల్లవాడి గొంతుతో చిట్టిరెడ్డి తండ్రి నోట్లోకి యింకొక సిగరెట్టు అందించాడు. పొగపూదుతూ యిద్దరూ పకాలు మన్నారు. అన్నమ్మ వచ్చి "ఏమిటీ తంతంతా?" అన్నది నడుంమీద చేతులు వేసుకొని. తండ్రీ కొడుకులు తమ కర్తమైన చిరునవ్వు భాషలో మాట్టాడుకొని చెరొకదారిన పోయారు. ప్రతాపరెడ్డి కళ్ళనిండుగా నీరు తిరిగినది.

ఆ రాత్రి అన్నమ్మ పడమటింటిలో వున్నప్పుడు, ప్రతాపరెడ్డి కావిడి పెట్టెతీసి, బావిలోతు చేయించేందుకు, కో ఆపరేటివు బాంకులో చీనితోట తాకట్టు పెట్టి తెచ్చిన మొత్తంలో ఒక వంద తీసుకొన్నాడు.

హాస్పేట వెళ్ళేప్పుడు యిద్దరూ అన్నమ్మతో బొంకారు. "కర్నూలు బోతున్నాం. మా ప్రిన్సిపాలుగారి ముందు నాన్న వేలుముద్ర వేస్తేగాని నన్ను ప్యాసు చెయ్యరు" అని చిట్టి ఆత్రుతతో అన్నాడు.

"పుల్లెద్దు ఒంటినబడ్డది. దాన్ని ఆరా గనుక్కోకపోతివి. ఎట్లా?" అని అన్నమ్మ మొగుణ్ణిచూచి అన్నది. పుల్లెద్దంటే అన్నమ్మకూ, యింటిల్లి పాదికీ ప్రాణం. చిట్టి పుట్టకముందు అది కోడె దూడగా, యింటి బిడ్డగా పెరిగింది. అది ప్రతాపరెడ్డి జేజెమ్మ చచ్చిపోతూ యిచ్చిపోయిన గోధుమరంగు ఆవు పెయ్య మునిమనుమడు. అందరూ పిలిచే ముద్దుపేరు—అన్న—అని, ఆ యింటికి చిట్టిరెడ్డికి ముందున్న బిడ్డ గనక.

"ఎల్లుండి తిరిగి వస్తున్నాం గదా? సన్నైన మేతలేకేలే దాని యేడుపు" అని ప్రతాపరెడ్డి అక్కడ ననిగితే యిక ప్రమాదమని కడప దాటాడు.

రైల్లోను, హాస్పేటలోనూ చిట్టిరెడ్డి నోట్లను చిల్లర కాయితాల్లాగా ఖర్చు పెట్టాడు. ప్రతాపరెడ్డికి కొడుకులో తప్పు కనబడలేదు. దర్జాగా, మనిషికి మనిషిగా, కాఫీ హోటళ్ళలో కుర్రవాళ్ళను అదిలించటం, హాస్పేటలో జట్కా బండి సాయిబుల నోటి దుడుకును, ముతక పదజాలాన్ని ఒక్క కంటి తీవ్రమైన

చూపుతో అరికట్టగల్గిన తన కొడుకు, రైలంతా కొన్నట్లుగా బలిసి నిద్రపోతున్న బళ్ళారి సేఠ్లను, మలబారు పోలీసుల్ని గదిమి, కళ్ళ బరువుతో, బెంచీలమీద, రొండడుగుల స్థలంలో కూచొనబెట్టగలిగిన తన కొడుకు—యిటువంటి నోట్లను ముందు రోజుల్లో ఎన్ని సంపాదించనున్నాడు? ఏం? యిప్పుడు ఖర్చుగాక మరెప్పుడు? కరువుగావొచ్చు? తనుండగా తన చిట్టికేం కరువు?

హంపీలో అంతకుముందే వచ్చిన విద్యార్థి బృందంలోనుండి చిట్టిరెడ్డి స్నేహితుడు రాజు కలిశాడు. సన్నగా, దివ్వెవలె శరీరం లేక ఒక్క ఆత్మతోనే లోకాన్ని పరిసరాన్ని కదిలిస్తున్నట్లుగా మాట్లాడాడు ఆ కుర్రవాడు. అతి తొందర. కళ్ళజోడు వెనుక నుండి అగ్ని కురుస్తున్నట్లుగా ఆ మాటల దోరణి.

"నా స్నేహితుడు—రాజు, నాన్నా! భలే తెలివిగలవాడు" అని చిట్టి పరిచయం చేశాడు.

ప్రతాపరెడ్డికి ఏమనాలో తెలియలేదు. ఆ కుర్రవాడు, ఆ వెలిగి జ్వాజ్వల్యమానంగా వున్న ఆ దివ్వె—తన కొడుకు మిత్రుడు. ప్రతాపరెడ్డిలో సహజమై, పొందికై, రక్తమై దాగివున్న ప్రేమ, ఆదరం, అభిమానం పొంగి, రాజు విజ్ఞాన పూరిత ముఖవర్చస్సును చుంబించబోయినవి. రాజు మాట్లాడే ప్రతిమాటలోనూ ఏదో గొప్ప అర్థం, సామాన్య మానవదృష్టికి అతీతమైన వున్నత మనస్తత్వం దాగివున్నట్లు రెడ్డి హృదయానికి తట్టినది. ఈ నడిచి, మాట్లాడగల జ్యోతి తన స్నేహితుడని చెప్పుకొనటం చిట్టికేమాత్రమూ గర్వంగా కనబడలేదే? ప్రతాపరెడ్డి కించపడి, తన ఆంతరంగిక భావవాహినిలో మునిగి తబ్బిబ్బై, అవమానంతో మూగగా నిల్చొని, తెప్పరిల్లి, రాజు మండుతూన్న కళ్ళు ఒక్కసారి చూసి—

"మావాడు ...నా కొడుకు ఒక్కడే—" అని చిట్టిని చూపాడు.

రాజూ, చిట్టీ నవ్వారు. రాజు ఎగతాళికి నవ్వలేదని రెడ్డికి తెలుసు. తనలో లేని కల్చరుకోసం పైకి వెలిబడని వున్నత భావాల ఆత్మను సూటిగా అర్థంచేసుకొని నవ్విన నవ్వుగా దృగ్గోచరమైంది. లోకంలోని బాధనంతా తను మింగి, మొయ్యలేక తన భుజస్కంధాలమీద, తన కళ్ళ విషాదంలో మోస్తున్న యీ అసామాన్య యువకుడా, తన చిట్టి స్నేహితుడా—అర్థహీనమైన తక్కిన కాలేజి మూక నవ్వు నవ్వేది?

రెడ్డిహృదయం పొంగింది. "మోటువాణ్ణి, చదువుకోలేదు" అన్నాడు క్షమార్పణ కోరుతున్నట్లుగా, రాజుతో.

రాజు సీరియస్ ముఖం కందిపోయింది. పెదిమలు వణికినవి.

"ఎవరన్నారు? ఎవరికా అధికారం? మీ ఆత్మలో మీరు ఉత్తమపురుషులు. మీకు నేను— నమస్కరించి గర్వించగలను. నేను!— రాజును!! మీరు భాగ్యంలో, అర్థంలేని చదువులో, దొంగ గౌరవ పద్ధతుల్లో పెద్దమనుష్యులు కాకపోవచ్చు. నేను నమస్కరిస్తాను."

ప్రతాపరెడ్డి రాజుచేతిని, కన్నీళ్ళతో తనచేతిలోకి తీసుకొని, పావురాయి వీపును నిమిరినట్లు నిమరసాగాడు. చిట్టితో ఒకసారి తమ యింటికి వచ్చిన చౌదరిగారబ్బాయి, పోకిరి షోకుల్లో, ఆడపిల్లలమీద విసిరే రౌడీ మాటల్లో తన హృదయాన్ని గాయపరిచి, వున్నంతసేపూ తనను ఆంబోతు ఎద్దును చూచి నట్లుగా చూచాడు. కాని ఈ పరాయి బిడ్డ— యీ నాగరికుడు!

చిట్టి యీ సన్నిహిత భావ ప్రకటనకు ఉబ్బిపోయి —"నువ్వు రాజును మాట్లాడించవద్దు. వాడికి జ్వరం వస్తుంది" అన్నాడు.

అప్పటికే పొద్దు తిరిగింది. ఇక హంపీ శిథిలాల్లోని హృదయ వేదనతో చుట్టూ నడక ప్రారంభమైంది. చీకటి పడుతున్న కొద్దీ రాజు మాటలు భయంకర మనిపించినవి. ప్రతాపరెడ్డి ఆత్మ, రాజు ఆత్మతోపాటు ఆ శిథిలాల్లో, ఒకనాటి జీవనవాహినినుండి మిగిలిన గులకరాళ్ళలో ప్రతి ఆలోచనకు. మాటకూ వణికి పోసాగింది. రాజు నోరు మూతబడలేదు. గణాచారిపలె తూలుతూ, తాగిన వాడి వలె ఏదో లోకంనుండి మాట్లాడుతూ దృశ్యాలు, మంటపాలు, మహళ్ళు, ఆలయాలు చూపించసాగాడు. అగి, అగ్నివలె వర్షించేవాడు మాటల్ని.

"ఇక్కడ - ఈ పుణ్య స్థలంలో - వేట కుక్కను కుందేలు తరిమి కొట్టింది. విద్యారణ్యులు చూశారు. ఇక్కడ క్రిష్ణదేవరాయలి జెండా ఎగిరింది. మన తెలుగు కవిత్వం, భాగ్యం, ఔన్నత్యం, మన ఆత్మే - యీ రాళ్ళ కింద శోకిస్తున్నది. మన సంగీతంలో యీ తుక్కు గాయకులు, కవులూ పిచ్చి మాటలూ, రాగాలూ వాడుతున్నారు. వాళ్ళని యీ సంగీతం, శిథిల విజయ నగర రాజ్య సంగీతం వినమంటున్నాను."

రాజు కంఠం గద్గదికమైపోయింది. చుట్టూ కలియజూసి ఆకసంవేపు తల ఎత్తాడు. అక్కడక్కడ చంద్రుడు లేని గంభీర నీలిమలో నక్షత్రాలు తారట్లాడుతున్నాయి. రాజు మాటలు తిరిగి చీకటి రాత్రిని, అనంత శూన్యాన్ని, శిథిల బీభత్సాన్ని చీల్చుకుంటూ వినిపించినవి.

"ఆ రోజులు రావు. రావు. కాని, తిరిగి మన పతన శోభ వికసించక తప్పదు. విజయనగర శోభగా గాదు- విశాలాంధ్ర శోభగా!"

కంపించింది ప్రతాపరెడ్డి ఆత్మ ఆ కంచుమోత మాటలకు. శిథిలాల్లో కూర్చొని ముగ్గురూ చీకటినే, మనస్సునే ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో అనుభవిస్తున్నారు. చీకటిలో ఏమీ కన్పించటంలేదు. వేయిస్తంభాల విఠలస్వామి ఆలయపు ఆవరణలో బండమీద కూచున్న రాజు హఠాత్తుగా లేచాడు. గంగాఝురివలె, వర్షాకాలంలోని అఖండ గోదావరి వరదవలె అతడు ఆంధ్ర చరిత్రను ఏకరువు పెట్ట సాగాడు. "ఈ మూల ఫలాని, ఆ దిక్కున ఫలాని....ఆ పాలకుడు, ఈ మంత్రి, ఆ వంశం, ఈ వంశం"- అక్షౌహిణివలె సంవత్సరాలు, శతాబ్దులు, కిరీటధారులు సామ్రాజ్యపతులు, మహారాణులు, సేనాపతులు, మంత్రిపుంగవులూ, యుద్ధాలు- చరిత్రకు చరిత్రే ప్రతాపరెడ్డి నయనాల యెదుట నడిచి వెళ్ళినది. రాజు ఒక్కక్షణం ఆగి గాలి పీల్చుకొన్నాడు. ఆ నిశ్శబ్దమే భయంకరంగా మారింది. విజయనగర రాజధానిలోకం నుండి హఠాత్తుగా చలిగాలి వీచే చీకటిలోకి, కాటకపు పులులు విహరిస్తున్న తన అడవిలోకి విసిరివేసే యీ భయానక నిశ్శబ్దం! చీకట్లో తన కొడుకుచేతినీ, రాజుచేతినీ పిరికిగా తడిమి చూదాడు—ప్రతాపరెడ్డి.

"వద్దు....వద్దు....రాజూ....ఆపవద్దు."

రాజు ఏడుస్తున్నాడు. ప్రతాపరెడ్డి లేచి అతన్ని కావిలించుకొన్నాడు, రాజు ఆత్మ అతనితో మాట్లాడింది.

"ఆ అందమంతా నాశనమైందనేనా?
ఎవరా నాశనం చేసిన దుర్మార్గులు?"

రాజు రుద్ధమైన కంఠాన్ని సర్దుకొని—

"తల్లికోట....కోట....మన జెండా పడిపోయింది. తురకలు....విదేశీ బహమనీరాజుల తొత్తులు.... యీ అమరలోకాన్ని, అందాన్ని, మన నాగరికతనే కాలరాచారు."

ప్రతాపరెడ్డిని, రాజునూ చూచి చిట్టిగుండె చెదరిపోయింది. "నాన్నా!...." అన్నాడు.

కాని, రెడ్డి అక్కడ....ఆ లోకంలో లేడు. అతని చర్మం కింద - రాజు మహావాగ్ధోరణితో, రాజు చరిత్ర దర్శనతో, రాజు విజ్ఞాన స్రవంతితో వేగంగా రక్తం పారాడినది. కటకంనుండి దక్షిణాదిదాకా తెలుగుజెండానీడను, శాంతితో సుభిక్షంతో, ధర్మపాలన సాగించిన పురాతన వీరుల రక్తం ఆ నాళాలనుండి ఉబికింది ఒక శరీరంనుండి మరొక శరీరానికి విద్యుత్ వేగంతో ఆ ఆవేశం ఏక వాహినిగా పారింది.

రాజు అన్నాడు - మళ్ళీ:

"అందుకు కత్తిగట్టలేం యిప్పుడు. చీలి చెదిరివున్న తెలుగు జాతి ఒక రాష్ట్రం కిందికి తప్పక వస్తుంది దానితో మన నంది కొండ, మన సిద్ధేశ్వరం, మన రామపాదసాగరమూ వస్తాయి. తెలుగు నాడంతా దీపావళి రాత్రివలె వెలిగే రోజులు - ఈ కరువునూ, దారిద్ర్యాన్నీ, నిరాశను ఎరగని రోజులు!"

ప్రతాపరెడ్డి రాజును తన కౌగిలినుండి విడిచాడు. చీకటిలోనే రాజు వెలుగుతూన్న కళ్ళవర్చస్సు చూశాడు. తనకు తెలియని విషయాలు అంత సులభంగా, గ్రాహ్యమయ్యేట్లుగా ఆ ధోరణి.

"నిజంగా-?"

"అవును. యిందులో అబద్ధమేముంది? మూడుకోట్లమందిమి - మనమను కొంటే కాని శుభకార్య మేముంది?" ఈ ఒక్క వాక్యం రాజు మహాయోగివలె అన్నాడు.

"ఎప్పుడు?" ప్రతాపరెడ్డికి తెలియకనే ఈ ప్రశ్న బయటికి దూకింది.

"అవును....అదే ప్రశ్న. నావంటి యువకులు చాలామంది చావాలేమో?" రాజు వదనం తిరిగి శాంతమయమై పోయింది.

"వద్దు....వద్దు....నువ్వు....మీరు... చచ్చిపోగా మళ్ళీ మిగిలేవి యీ రాళ్ళూ రప్పలే. వద్దు. నువ్వులేనిది ఏదీ వద్దు" అని ఆత్రుతతో, ఆందోళనతో రెడ్డి ఆ అసామాన్య యువకుడిచేతిని తిరిగి పట్టుకొన్నాడు.

ఈ మాటు మళ్ళీ ఆ ఆత్రుతను, భయాన్ని చూచి చిట్టిరెడ్డి నవ్వి - "నువ్వన్నంత మాత్రాన రాజు బతుకుతా డనుకొన్నావా? ఇంత తెలివి గలవాడు లోకంమీద చాలాకాలం నిలువలేడు" అన్నాడు కొంత చిలిపిగా, కొంత అమాయికంగా.

అజ్ఞాతమైన విషాదం ఆ చీకటిని అవరించి వుంది. ఆ మాటలు శూలాలుగా ప్రతాపరెడ్డి ఆత్మను గాయపరిచినవి. "ఛీ, ఛీ, ఏం మాటలు?" అని మాత్రం కష్టంతో అనగలిగాడు.

తిరునాళకువెళ్ళి జనం తోపుడులో, కోమట్ల పాత నూనె మిఠాయి వాసనలో, అసయహస్త్రీలూ, పురుషులూ, నిజమైన భక్తులూ, దసరాబుల్లోళ్ళు ఏ మోసాలకో లోబడి దిగాలుగా తిరిగిపోయే ప్రయాణ మనుకొన్నయీ హంపీ యాత్ర, తన ఆత్మ విశ్వవిద్యాలయ పరీక్షయిపోయింది. సన్నని, కళ్ళజోడు యువక ఆచార్యుడు రాజు - తనకు బిరుదపట్టాన్ని యిచ్చాడు. హోస్పేటకు ఆ రాత్రి ముగ్గురూ నడిచి హోటలు చేరుకొన్నారు. కాని, ప్రతాపరెడ్డిని మైకం వదలలేదు. ముగ్గురూ దిగులుతో, బరువుతో ఎంగిలి చేశామనిపించారు.

మర్నాడు రాజు నేరుగా కర్నూలు వెళ్ళాడు.

"మీరు చిట్టికి అంత డబ్బు పంపనవసరం లేదు. నాకు తెలుసు. మీనోరు నాలిక కట్టుకొని చిట్టికి యిస్తున్నారు. వాడు అతి ఖర్చుదారు" అన్నాడు రాజు, బస్సులో కూర్చొని. దిగులుతో, పిచ్చివాడై ప్రతాపరెడ్డి, ఆ కాగడాను చూశాడు.

"వద్దు. దిగులువడవద్దు మనమింకా చాలా చూడాలి, చెయ్యాలి. ధరణి కోట, నాగార్జునకొండ, ఓరుగల్లు, కొండవీడు - చాలా వున్నవి. మళ్ళీ కలుద్దాం. మన పొలాల చవిటిలో బంగారం పండే రోజులు రావాలిగదా మరి? వస్తయ్! వస్తయ్! ఈ దిబ్బలమీద జీవం కురుస్తుంది మళ్ళీ. చూస్తారుగా. చూస్తారుగా!"

మా వూరు రమ్మని చాలా బలవంతం చేశాడు రెడ్డి. కాదు, మీటింగులు అన్నాది ఆ దివ్యజ్యోతి.

## 3

రైలులో చిట్టిరెడ్డి రాజు చరిత్ర చెబుతుండగా ఖిన్నుడై విన్నాడు ప్రతాపరెడ్డి.

"వాడి మనస్సు అతికోమలం. ఎక్కడున్నా అన్యాయమంటే సహించ లేడు. అందరి బరువులూ తన నెత్తిన వేసుకొంటాడు. బలవంతుల, దుర్మార్గుల శత్రుత్వం నిర్భయంగా కొనుక్కొన్నాడు. ఆస్తిపాస్తులు అన్నీ పోయినవి. ఆరోగ్యం మంచిది గాదు. చదువు కుంటినడకతో సాగుతున్నది. వాణ్ణిచూస్తే నాకుగూడా దిగులే నాన్నా! ఏం చెయ్యను? వాడికివ్వవలసిన అమ్మాయిని, బీదవాడని యివ్వక వేరే చోట యిచ్చేశారు. ఆ సంగతి ఎవరికీ చెప్పడు. దిగులుతో కుళ్ళిపోతున్నాడు మనం ఏదైనా డబ్బు సహాయం చేస్తే వచ్చే యేడు గూడా వాడి చదువు గట్టెక్కుతుందేమో!"

ప్రతాతరెడ్డికి యీ సూర్యరశ్మిలో వెలుగుతోన్న ప్రపంచవు అత్యాచారం నగ్నంగా కనబడ్డది రాజు, ఆ దివ్యజ్యోతి, ఆ బాలయోగి, ఆ విప్లవమూర్తి, ఆ మహాత్మా - పేద? చదువు ఆగిపోతుందా? అందరి భవిష్యత్తుకోసం కలలు సాధిస్తూన్న యీ యువకుడికా శత్రువులు? ప్రతాపరెడ్డి ఆలోచించినకొద్దీ విషాదమూర్తి కాసాగాడు.

నీడవలె కన్పించింది జీవితం. తెల్లనీడ యీ పగలు; కనబడని నల్లనీడ రేయి. ఈ నీడలకు రాజువంటి సుందరమైన వస్తువెందుకు? వస్తువును పీడి, నీడవంటి మీసాలు దువ్వుకొని లోకం కూర్చొని సంపెంగనూనె రాసుకొంటోంది, ప్రతాపరెడ్డి ఆలోచనలలో రాత్రి, మృత్యువూ, నిశ్శబ్దత, నిరామయత - రాజు చుట్టూ నగ్న నృత్యం చేస్తున్నట్లు కన్పించినవి. తన భయంతో కుంగిపోయింది ఆత్మలోని ఔన్నత్యం. కొడుకు వంక చూచాడు. రాజును తన రెండవ బిడ్డగా చూచాడు. ఆ కాగడా జ్వాలనుండే తన కొడుకు వెలుగుతున్నాడని తెలుసు కొన్నాడు. హంపి నుండి వచ్చిన తర్వాత అన్నమ్మతో తగాదాలు జాస్తి అయినవి. పూనిన భక్తుడివలె ప్రతాపరెడ్డి దేవినీ అంటీ అంటకుండా, ఏ విష యంలో జోక్యం కలుగజేసుకోకుండా తిరగసాగాడు. దానితో అన్నమ్మ మరీ మండిపోయేది.

ఇంతలోనే సహకార సంఘం నుండి తెచ్చిన బాకీకి సమన్లు వచ్చినవి. బాకీ చెల్లింపులు వాయిదా వెయ్యమని కోరుతూ కాయితాలు రాశాడు చిట్టిరెడ్డి. కాని, సంఘం చీనితోటను వేలంకు పెట్టించింది. మొదట్లో ప్రతాపరెడ్డి పట్టించు కోక, ఆలస్యంగా యింటికి రా మొదలుపెట్టాడు. ఇంట్లో తిండిగింజలు గూడా తరిగిపోయినవని తెలుసుకొనిగూడా కన్నెత్తి చూడలేదు. కాని, చిట్టి బలవంతంతో యిద్దరూ సహకార సంఘ సెక్రటరీ వద్దకు పయనం గట్టారు.

మిట్టమధ్యాన్నానికి గాని పట్నం చేరుకోలేకపోయారు. ఈడ్చి కొట్టే ఎండల్లో, నీడలేని రోడ్లమీద చచ్చిన పిట్టల్ని చూస్తూ చేరారు. సెక్రటరీ లేడు. గుమస్తా వున్నాడు. వేళగాదని సనిగి, దాస్యంలో, దరిద్రగర్వంతో ఆత్మనూ, గౌరవాన్ని లెక్క చెయ్యని ముసలి గుమస్తా - అర్థం అయ్యే భాషలో "ఏమిస్తా వయ్యా? నీ పని అవుతుందిలే" అన్నాడు.

ప్రతాపరెడ్డి చిట్టివంక చెమట తుడుచుకుంటూ చూశాడు.

చిట్టివేళ్ళతో రూపాయ సంజ్ఞచేసి "లంచం" అన్నాడు.

ప్రతాపరెడ్డి చేతులు ముఖంమీదినించి జారిపోయినవి. మేత లేక ఎత్తుబడ్డ వుల్లన్నను, డబ్బులేక చదువాపిన రాజును, రేవు తిరిగి కాలేజీలో చేరలేనని నిరాశ చేసుకొన్న తన చిట్టినీ - కళ్ళ ముందుకు ప్రయత్నించకుండానే తెచ్చుకున్నాడు. కొత్త ఆత్మ, కొత్త అందం లోకానికి వస్తయ్యని రాజు చెప్పిన భవిష్యత్తు సౌందర్యం, యీ నల్లని హృదయపు ముసలి దరిద్రనారాయణుడి వర్తమానం ముందు ఎంత అసంభవంగా కన్పించింది? ఉద్రేకియై కొట్టటానికి చెయ్యెత్తాడు. చిట్టి ఒక్క తృటిలో అడ్డుపడ్డాడు.

* * * *

వేసంగి సెలవలు అయిపోతూండగానే చిట్టి తండ్రితో అన్నాడు - "హాస్టలుకు దరఖాస్తు పెట్టుకోవాలి. జీతాలు, పుస్తకాలూ మూడొందలు దాకా యీ ద్దేట్లుగా వుంది."

రెడ్డి కొడుకును కన్నార్పకుండా చూచి - "మరి రాజుమాట?" అన్నాడు.

"అందుకనే...."

మళ్ళీ యిద్దరూ మాట్లాడుకోలేదు. రాత్రి ప్రతాపరెడ్డి చాలా సేపటి దాకా మేలుకొనే వున్నాడు. సందుకాయ పెట్టెలో అన్నమ్మ పాతకాసుల కంటె వున్నది. బోలుకంటె ఈ ధరల్లో నాలుగయిదు వందలకన్నా ఎక్కువ పలకరు.

ఉదయం హడావిడిగా కొడుకును ప్రయాణం చేయించాడు. ఆ రోజు జొన్నలు తెచ్చిగాని అన్నమ్మ తిండిపెట్టదు. పెట్టెలో చిట్టిగుడ్డల కింద రాత్రి తీసిన కంటె దాస్తూ - "ఇదొక్కటే వున్నది. యిద్దరూ చేరండి. జాగ్రత్తగా వుండండి" అని అతడి ముఖం చూడకనే పలికాడు. చిట్టి వెళ్ళిపోయాడు.

మూడవ రోజుకు అన్నమ్మ దొంగతనం కనిపెట్టి తిట్టిపోయసాగింది. లక్ష్మి నడిచిపోయిందని వాపోయింది. శాపనార్థాలు పెట్టింది. మెటికెలు విరిచి, అఘాయిత్యం చేసి జుట్టు పీక్కొన్నది. రెడ్డి యింట్లో కాలు పెట్టకనే అడా పెడా సావిట్లో తిరిగాడు.

పుల్లన్న మేత సంగతి మిగిలింది. పెదరెడ్డి గారింటికి వెళ్ళి చూచాడు. ఎవరూ కనిపించలేదు. కన్పించింతర్వాత, తన జీవితంలో మొదటిసారి బిచ్చ మెట్లా ఎత్తాలో తెలియక తిరిగివచ్చాడు. అన్నమ్మ రాగుల సంకటి పెట్టి ఆవలకు వెళ్ళింది ఆ రోజున. మాలపల్లి, మాదిగపల్లి, గౌండ్లపేట, కుమ్మరవీధి - అంతా నిర్మానుష్యమైపోయింది.

అడివి నుంచి చింతగింజలూ, ఈతగింజలూ తెచ్చుకుని ఆ పిండితో అంబలి తాగిన యేతవాళ్ళ ముసిలమ్మల కిద్దరకూ కలరా తగిలి, ఆ సాయంత్రమే చచ్చిపోయారు. ప్రతాపరెడ్డి పోయి, శవ దహనానికి సహాయపడ్డాడు. కరువు అప్పలిస్తారని తాసీల్దారు రాగా, అందరితోపాటు తనూ అర్జీ పెట్టాడు, అందరితో పాటుతనూ తాలూకాచుట్టూతిరిగివచ్చాడు. మఠంస్వాములవార్లువచ్చి గంజికేంద్రం తెరిచారు మరునాడు వూళ్ళో. పంచినవాళ్ళకు - పల్చని గంజి పంచగా - యింకా రొండొందల ముసలి, పసిబిడ్డల కూలినాలి జనం మిగిలిపోయింది. వారంరోజుల్లో యీ గంజి కేంద్రం ఎత్తివేశారు. పంచాయితీ కోర్టు ప్రెసిడెంటు-రంగనాయకులు రెడ్డి కలెక్టరును తెచ్చి చూపి, కొత్త గంజి కేంద్రం తెరిపించాడు. ఈ కేంద్రానికి రంగనాయకులు రెడ్డి గుమస్తా వీరబ్రహ్మం పెద్ద.రోజుకు అయిదార్ల శేర్ల జొన్నలూ బియ్యమూ కాజేసి, మిగతా భాండిలో యింత ఉప్పూ అన్ని వుల్లిపాయలూ వేసి, చుట్టుపక్కల పల్లెల నుండి అయిదారుమైళ్ళు నడిచి వచ్చిన అనాథలకు వేడినీళ్ళు వడ్డించసాగాడు. లక్కిరెడ్డిపల్లె నుంచి వచ్చిన గోతాం ముక్కల చెప్పుల ముసలి వాడు వడదెబ్బ తిని కేంద్రం ముందే చచ్చిపోయాడు.

అక్కడికి మూడుకోసుల దూరంలో కరువు రోడ్డు పనులు సాగుతున్నవి. ఎవరికీ చెప్పకుండాపోయి, ప్రతాపరెడ్డి రోడ్డు కూలిపనికి చేరాడు. అక్కడా యింతే. యిదే అన్యాయం. యిదే రాక్షసత్వం. సాయిబు కంట్రాక్టరు. ఏ రోజు కూలీ ఆ సాయంత్రానికి యిస్తారన్న ఆశతో ప్రతాపరెడ్డివెళ్ళాడు. కాని, బట్వాడా జరగలేదు. అదేమని అడిగితే, సాయిబు కడపనించి దిగుమతి చేసిన రౌడీలు హరిజన స్త్రీలను చావ మోదసాగారు. ప్రతాపరెడ్డి వెళ్ళి పెద్ద గడ్డపలుగు చూపి

అడ్డుపెంచొన్నాడు. మర్నాడు ఆ పనిగూడా పోయింది. కాని, అక్కడ కోమటి దళారిగుంపు, ఇంకొక రెడ్లదళారిగుంపు వున్నది. కడుపు కాలినవాళ్ళు ఎంతకైనా లొంగి వస్తారని ఆ గుంపు రూపాయికి బేడ వడ్డీతో, ఆ అన్నార్తులకు అప్పులు బెట్టి, ఆకాశపు ధరకు మట్టిగలిపిన జొన్నలమ్ముతున్నారు. ఈ కంట్రాక్టర్లు, దళారి గుంపు అంతా ఒక చేనని ప్రతాపరెడ్డికి తెలిసిపోయింది.

ఉదయతేజస్సుతో లోకం స్నానం చేస్తున్నదనీ, మహోదయం ఉదయించనున్నదనీ రాజు హంపిలో చీకటిరాత్రి చెప్పిన మాటల్లో ఎప్పటి సత్యం వున్నదో కాని యీ వాతావరణంలో విషమే గాలిగా వీస్తున్నది. పరచుకొని రెక్కలతో మృత్యువు దిక్కులను కప్పివేస్తున్నది. ఈ విషపూరిత ఉచ్ఛ్వాస నిశ్వాసాల బరువుతో తను గూడా మృత్యువును సమీపిస్తున్నట్లనిపించింది. ఈ ఆత్మలేని, రాజు భావాలులేని లోకంకన్నా, మృత్యువూ, దాని తర్వాత ఏ లోకమైనా వుంటే ఆ లోకపు చల్లదనమూ, శాంతీ, దాని ఆలోచనా ఎంతో ముదావహంగా వుంది. ఆకలి నుండి, అన్యాయం నుండి మానవజాతికి విముక్తి లేదని ప్రతాపరెడ్డి ఇంటికి తిరిగివచ్చాడు. నిస్సహాయులైన తన తోడివాళ్ళలో గూడా కారణమూ, ఆత్మా, రక్తమూ కన్పించలేదు ప్రతాపరెడ్డికి. ఈ మహా సుగుణాలు వున్న రాజా చిట్టీ ఏమవుతున్నారు?

ఆ రోజున చిట్టినుండి జాబు వచ్చింది. కొత్తగా పెట్టిన పోష్టు ఆఫీసులోనే దాన్ని చదివించాడు. "రాజుకు జ్వరంగా వుంది. నిన్ను చూడాలని అంటున్నాడు. వెంటనే బయలుదేరి రావలెను - చిట్టి." అంతే. ఆ నాలుగు ముక్కలే. నిల్చొన్నపాటునే బయలుదేరాడు. నడిచి నడిచి, ఆకలితో, దాహంతో, దిగులుతో, జీవచ్ఛవమై రాత్రి పది గంటలకు కర్నూలు చేరాడు.

చిట్టితోపాటు రాజు హాస్టల్లో లేడు. వేరే గది తీసుకొని దుమ్మూ, ఈగలూ ముసురుతూన్న బజారులో వున్నాడు. రాజుకు జ్వరం పేలిపోతున్నది. కాని, మాటలధోరణి అట్లాగే వున్నది.

"జన్మభూమి...." అన్నాడురాజు.

లోతుకుపోయిన కళ్ళతో ప్రతాపరెడ్డి రోగిని తిలకించాడు.

"జన్మభూమి - కరువు గడ్డ కావొచ్చు. ఎడారి యిసుకతిప్ప కావొచ్చు. బీడు, కంచె, వరద, చవిటిదిబ్బ కావొచ్చు. కాని, మనల్ని కన్నతల్లి. తల్లిని

మనం ప్రేమించకపోతే, మరెవరికి వాత్సల్యం? మన ప్రేమ చివరికి హంపీ శిధిలాలై, రుద్రభూమియై దక్కుతుందేమో! దక్కవచ్చు. కాని, ఆ శిథిలాల నుండి కొత్త సౌందర్యంతో తల్లి ప్రకృతి నిలుస్తుంది. ఆ శిథిలాల శివతాండవం నుండి నవ్వుతూ, చేతులు చాచుతూ మన బిడ్డల్ని సాకుతుంది. రాబోయే సంతానానికై యీనాటి శిథిలాల్లో త్యాగం తప్పదు. అందుకు మిమ్మల్ని పిలిపించాను." రాజు కళ్ళు అగ్నివలె మండేవి మరింత ప్రస్ఫుటంగా మారినవి.

ప్రతాపరెడ్డి ఆ మాటల భయంకర సత్యానికి వణికిపోయాడు. మృత్యువునూ, దాని తర్వాతి శాంతినీ వాంఛించినవాడు - యీ తన రాయలపుర శిథిలాల్లో నివసించ మరలాడు.

"రాను - రాను - అక్కడే వుంటాను. చిట్టి అందరమూ యిక్కడే వుందామని అన్నాడు కాని, రాను. అక్కడే, ఆ మిత్తి చాపుకు నేను ఎదురుపోయి ఎదురు చూస్తాను."

"అవును, మృత్యువు గూడా చస్తుంది. అది శాశ్వతంగాదు. ఈ గడ్డ, దానిని నమ్మినవాళ్ళు - యివే శాశ్వతమైనవి. ఈ మాట వచ్చినప్పుడు చెప్ప గలను." రాజు కళ్ళు మూసుకొన్నాడు - అలసిపోయి.

సాయంత్రం డాక్టరు వచ్చి - "సన్నిపాతం. ఆస్పత్రిలో చేర్చాలి. యిక్కడ దిక్కు చూచే ఆడవాళ్ళు గూడా లేరాయెను" అని విసుగుపడ్డాడు.

రాజు డాక్టరు ముందే పెద్దగా నవ్వసాగాడు. ఆ బొమికెల గూడు పైకి ఎగిరి పక్క మీది తూలిపడ్డది.

"ఎవరి ధర్మం - అది లోకానికి మేలుకూర్చేదైనప్పుడు వాళ్ళు ప్రాణానికి తెగించయినా నిర్వహించాలి. మన స్త్రీలు అగ్ని గుండాల్లో, పమిటె చేజిక్కించుకో జూచిన శత్రువుల కందకుండా, ఎందుకు దూకారు? తమ జన్మభూమి, తమ జన్మహక్కు, తమ అనంతాత్మ - అవి మరిచిపోకనే. వాటి నీడన, వాటి అవ్యాజ ప్రకృతిలో పెరిగి మరిచిపోతారా? పోరు. పోలేదు. పిచ్చిముండాకొడుకు. డైఫాయిడని వట్టి బెదిరింపు. అందుకని నా ఆత్మను చంపుకోనా?"

ప్రతాపరెడ్డి తన మురికితలగుడ్డ కళ్ళ కడ్డం పెట్టుకొన్నాడు.

చిట్టి వచ్చి తండ్రిని అటు పిలిచి - "బదకదని డాక్టరు చెప్పాడు. సంధి మాటలుట" అన్నాడు. నమ్మలేక రెడ్డి కొడుకు వంక బరువుగా చూచాడు.

"డాక్టరుకు డబ్బు యివ్వలేకపోయాం. అందువల్ల గూడా కొంత రాద్ధాంతం చేస్తున్నాడు." అని చిట్టి ముగించాడు. చిట్టి తండ్రి కళ్ళను సూటిగా చూడలేకపోయాడు.

ఆ రాత్రల్లా నడిచి, తెల్లవారు ఝాముకు రెడ్డి యిల్లు చేరాడు. ఈ లోకం నుండి సూర్యుడు అస్తమించనున్నాడు. ఈ రేయికే గాదు, శాశ్వతంగా, మరి తిరిగి దర్శనమివ్వకుండా, చెట్లనూ, పూలను, పిల్లల బోసి నోళ్ళనూ తిరిగి నవ్వించకుండా, భవిష్యత్తును వెన్నెల చల్లదనంలాగా చూపిన రాజు, తన చిట్టి చెలికాడు, తన గురునత్తముడు, తన బిడ్డ. ఈ లోకపు ఆత్మ, తన ఆత్మకు అగ్ని, చచ్చిపోనున్నాడు. అయితే, తనెందుకు తిరిగివచ్చాడు? డబ్బుకోసమా? ఈ లోకానికి ఆ విషాద ప్రవక్త అవసరం లేదుగదా? ఈ విష వాతావరణానికి ఆ స్వేచ్ఛా మలయవాయువు లవసరం లేవుగదా? అంతా రాజు మృత్యువు కెదురు చూస్తున్నట్లుగా వుంది. రాజు చచ్చిపోయింతర్వాతే యీ కరువు మాయమై, యీ చెట్లు వికసించి, యీ చెరువులు నిండి, యీ లోకం కలకలమని నవ్వుతుందేమో! ఆ చావుకే యీ ప్రకృతి విలపిస్తున్నదేమో! కాళీ వరం పొందిన కాళిదాసు మనస్సువలె రాజు సన్నిధినుండి తిరిగి వచ్చిన ప్రతాపరెడ్డి మనస్సు ఆలోచనలతో, దుఃఖంతో నిండిపోయింది. ఎవరిస్తారు డబ్బు? ఎక్కడున్నది డబ్బు? దళారి గుంపుల చేతుల్లో, నరరూప రాక్షసుల పెట్టెల్లో మూల్గే డబ్బు? రాయల సీమ పంటలను మోసుకు వెళ్ళిన షావుకార్ల యినుప పెట్టెల అంతర్భాగాల్లోనా? మృత్యువు తప్పదు. అవును, అన్నాడుగూడానే- ఆ శిథిలాల శివతాండవం తర్వాతగాని, యీ విలయ లోక నృత్య గీతిక తర్వాతగాని - జీవన దేవి చిరునవ్వు నవ్వదని! ఎవరికో బలీ అయిపోయే రాజు త్యాగంలో అర్థం ఏమిటి? ప్రవక్తా? బుద్ధుడా? కృష్ణుడా? క్రీస్తా? ఎవరీరాజు? ఆశనూ నిరాశనూ సమపాళ్ళలో తాగి తనకు అంటపన్నట్లుగా, నీ ధర్మం పాలించు, నా మృత్యువు నాపలేవు, ఈ మృత్యువునకు గూడా మృత్యువున్నదని వుపదేశించిన రాజు- కలనూ నిజాన్నీ విభజించగలిగిన రాజుకు తన మృత్యువు సంగతి తెలియదా?

ఆ రోజు వూళ్ళోకి కడపనించి ముసలి ఆవుల్ని, ముసలి ఎద్దుల్ని కొంటున్న కసాయివాళ్ళు వచ్చారు. పుల్లన్న నమ్మితే ఒక ముప్పై రూపాయలన్నా రాకపోవు. ఈ ముప్పైతో రాజు ప్రాణం నిలవవచ్చు. అప్పుడు సూర్యుడస్తమించడు గదా!

కాని, రాజా జన్మభూమి బిడ్డల్ని నమ్మమన్నాడు. భూమిని నమ్మినవాళ్ళకు నాశనం లేదన్నాడు తన తల్లి గడ్డను దున్ని, తన గాదెలు నింపి, తన దాహాన్ని తీర్చిన పుల్లన్నను తను నాశం చేయటమా? హుస్సేనాలీ వచ్చి ముప్పై అయిదు యిస్తానన్నాడు. జమాల్ సలభై దాకా పోయాడు. ఈ బేరం సంగతి ఆలకించి అన్నమ్మ వచ్చి ఫెళఫెళమని తిట్టిపోసింది. "మీ శిరసులు మండా. మీ జిమ్మలు పీక్కుపోనూ" అని కసాయి సాయిబుల్నీ, ప్రతాపరెడ్డినీ కలిపి దీవించింది.

ప్రతాపరెడ్డికి భయం వేసింది. మర్నాడు గూడా సాయిబులు వచ్చారు. మూడోనాడు రహస్యంగా కబురు చేశారు. ఆనాడే, రాజు ఆశ లేదనీ, చాలా జబ్బుగా వుందనీ చిట్టినుండి జవాబు వచ్చింది. కాని, ప్రతాపరెడ్డికి నమ్మకం కుదరలేదు. రాజా చచ్చిపోవటం? కల్ల. కల్ల. లోకంలో ఆత్మే నశించిపోతుంది. ఆ భగవంతుడి పరిపాలనే అంతమైపోతుందేమో గాని, రాజుకు చావులేదు. రాజు ప్రవక్త. ఆ స్వప్నదర్శి, ఈ పాపభూయిష్ఠ లోకానికి వెలుగు చూపి, ఆత్మల నుద్ధరించేందుకు వచ్చాడు. ఎవరికి చావు? మృత్యువుకేగాని రాజుకు గాదు.

కాని, వుత్తరం తీసుకెళ్ళి తిరిగి పంతులుగారి కొడుకుచేత చదివించు కొన్నాడు. నిజం. ఆ మాటలే. 'ఆశలు లేవు. చూడాలని వుంటే రా.' ఆ రాత్రి తెల్లవారలేదు. ఇక సూర్యుడుదయించడేమో? ప్రతాపరెడ్డి చిన్ననాటి దిగులుతో ముడుచుకొని, ఆకలి డొక్కలతో వసారాలో వుత్తరీయం పరచుకొని పడు కొన్నాడు.

మరునాడు - కడప కసాయి సాయిబులు కొన్న ఆవుల్ని, ఎద్దుల్ని తోలుకెళ్తున్నారు. రాజు కింకా నూకలు వున్నవి. లేకపోతే, యీపాటికి మృత్యువు మింగేసివుండేది. తను వెళ్ళి బతికించాలి. ఆవేశంతో గొడ్లసావిడిలోకి పరిగెత్తి, పుల్లన్న మెడపలుపు విప్పి, జమాలుద్దీన్ మందలోకి తోలాడు - ఒక్కక్షణంలో. జమాల్ నోట్లు లెక్కబెట్టి అయిదు తక్కువగా యిచ్చాడు. ప్రతాపరెడ్డి బేరమాడ లేదు. వుత్తరీయం కోసం వెతుకుతూ యింట్లోకి వచ్చాడు. కనబడలేదు. అక్కడా యిక్కడా వెతికాడు. వుత్తరమేమైనా వచ్చిందేమోనని పోస్టాఫీసుకు వెళ్ళాడు. యింకా జమాను రాలేదు. కూచొన్నాడు. ఇక నిలవలేక బస్సు రోడ్డు కని అడ్డం పడి పరుగెత్తసాగాడు. దుర్గవలె అన్నమ్మ ఎదురు వచ్చింది.

ఏడుస్తూ, లోతుకుపోయిన కరువు బుగ్గల్తో - అన్నమ్మ, ముఖాన మాడలాగా పెద్ద కుంకుమబొట్టుతో, అది దేవత రూపువలె అన్నమ్మ, ప్రతాపరెడ్డి చటుక్కున ఆగిపోయాడు.

రాజు ఏమని చెప్పాడు తన వుపదేశంలో? పృధ్వీపుత్రులను నాశనం చెయ్యొద్దనిగాదా? అన్నమ్మ ఎవరు? పృధ్వీపుత్రి. పుల్లన్న? పృధ్వీపుత్రుడు. తనకు రాజు మాటపై గౌరవంలేదా? చేతులు జోడించి అన్నమ్మకు నమస్కరించాడు. రాజు వర్ణించిన హిందూ క్షత్రియవనితలూ వాళ్ళ ఆత్మ బలిదానం తన కట్టెదుట నిలిచినై.

"పుల్లన్నను తిరిగి తెస్తాను. ఈ పాపిష్టి డబ్బు నాకు వద్దు. పుల్లన్నను తెస్తాను రాజు చావడు. రాజుకు చావులేదు. లేదు, లేదు...." అని గొంతువిప్పి ఆరుస్తూ ప్రతాపరెడ్డి అన్నమ్మను తప్పించుకొని రోడ్డుమీది కెక్కాడు.

అప్పటికే మందలు పొలిమేరలు దాటినవి. వగర్చుతూ మంద కెదురు బోయాడు ప్రతాపరెడ్డి.

"నా పుల్లన్నను నా కియ్యండి. నా పుల్లన్న నాకు కావాలి. యిదిగో మీ డబ్బు."

జమాల్ మృగశరీరం మీది తల బరువుగా తిరిగింది. "అరే, చెంబోల్ మొగం! హెపడ్కి యిచ్చావ్ భే పుల్లన్నా, ఎల్లన్నా, జావ్ జావ్" అన్నాడు తెలుగు భాషను చంపుతూ.

ప్రతాపరెడ్డిలో తెలుగు వీరుల రక్తం యింకిపోలేదు. ఖిల్లాలు, బురుజులు కట్టిన వీర రక్తం, వెనుజూపి ఎరగని వుడుకు రక్తం సామ్రాజ్యాలూ, విజయ యాత్రలూ కదిపి, నడిపిన చైతన్య రక్తం - రెడ్డిలో నాళనాళాన్ని వుబుకెత్తించింది.

"ఆగరా, వెధవ! - పుల్లన్నా....అహా....హా ...వ....య్యా....య్యా...." అని పుల్లన్న భాషలో మాట్లాడాడు. డొక్కలెండి, నెసురుకుగూడా దవడలు కదలని పిచ్చిపుల్లన్న, నీళ్ళుగారి పుసిగట్టిన కళ్ళతో యజమాని వంక చూచి, గుర్తుపట్టి ఒక్క చెంగణంతో మందనుండి తప్పించుకొని, ప్రతాపరెడ్డి వక్కకువచ్చి, తల వూపింది. రెడ్డి పుల్లన్న పక్కల్ని తడిమి, తట్టాడు.

జమాల్ బొడ్లో కత్తితీసి ప్రతాపరెడ్డి మీద కలియబడ్డాడు. తళ్ళికోటలో వున్న రెడ్డి ఆవేశం ముందు యీ రాక్షస ప్రకృతి తట్టుకోలేదు. జమాల్ కత్తినే లాక్కొని, వాడి కణత మీద బలంగా పొడిచాడు గాని, వెనక పొంచివున్న హుస్సేనాలిని చూడలేదు. ప్రతాపరెడ్డి ముద్దగా కూలిపోయాడు.

పుల్లన్న హంతకుణ్ణి నిటారుగా చూచింది. వాడు వెనుదిప్పగానే కొమ్ములు గిటించి, డొక్కల్లో పొడిచి, ఎత్తి కుదవేసి, దుమ్ములో పొర్లించింది. అరచి చచ్చిపోయాడు - ప్రతాపరెడ్డి హంతకుడు. మంద చెల్లాచెదురైపోయింది.

పుల్లన్న ఆలస్యం చెయ్యలేదు. ముక్కుతో యజమానిని తాకి వాసన జూసింది. ప్రాణం లేదు. ఆ కట్టెను కొమ్ములతో శిరసుమీది కెక్కించుకొన్నది. ఇంటిదారి బట్టింది. ఆరుబయట అన్నమ్మ వేచివున్నది.

భర్త శవాన్ని చూచింది. పుల్లన్న వీపునిమిరి ముద్దెట్టుకొన్నది. తన పమిటె చెరుగుచించి ప్రతాపరెడ్డి గాయాలకు అడ్డుపెట్టింది. ఆ రక్తం తీసి తన నొసలిమధ్య బొట్టుపెట్టుకొన్నది. కుప్పకూలిపోయింది.

*　　　　*　　　　*

ఆ రాత్రి రాజు చనిపోయాడు. చనిపోయేముందు మళ్ళీ పాత కళ వచ్చింది. ఆ ముఖంలోకి - "చిట్టీ! యింటికిపో. అమ్మ వీర కుంకుమ ధరించి నిన్ను పిల్చింది" అన్నాడు.

(ఆంధ్రపత్రిక - విజయ సంవత్సరాది 1953)

(1952 లో రాయలసీమ పర్యటనలో విన్న కొన్ని కథలు ఆధారం)